


"జీతం" నసిగాడు ఉద్యోగి

"ఊఁ" హుంకరించాడు యజమాని

"జీతం పెంచండి సార్!" చేతులు నలుపుకుంటూ అన్నాడు నౌకరు రామారావు

యజమాని సుబ్బరామయ్యగారు కళ్ళజోడు సవరించుకొని ఓసారి ఎగాదిగా చూసి "ఏమిటీ, జీతమా?" అన్నారు అవునన్నట్టు తలూపాడు రామారావు

"పెంచాలా?"

"ఊఁ!"

"ఎందుకూ?"

ఎందుకేమిటె అర్థంలేని ప్రశ్న!

"చాలటంలేదండీ!"

"ఎందుకు చాలటంలేదు?"

చాలటంలేదంటే యెందుకంటాడేమిటి? యేమిటా చచ్చుప్రశ్న?

"ధరలు మండిపోతున్నాయి. రూపాయిపెడితే అరకేజీ వంకాయలు రావటంలేదండి"

"అరకేజీ రాకపోతే పావుకేజీయే కొనుక్కోవాలి"

"పావుకేజీ సరిపోవండీ"

"ఎందుకు చాలవు?"

మళ్ళీ యిదేం ప్రశ్న? యెందుకు చాలవేమిటి!

"మా ఆవిడా నేనూ పిల్లాడు ముగ్గురికీ పావుకేజీ యెలా సరిపోతాయండీ?" నవ్వుతో అన్నాడు

"సరిపెట్టుకోవాలోయ్!"

ఈయన ఇంట్లో ఏదైనా రవ్వంత తక్కువైతే నన్ను పదిసార్లు బజారుకి తిప్పి తెప్పించుకుంటారు! పావుకేజీ యెవరికి సరిపోతాయనుకుంటున్నాడీయన?

* * *

"సరే, ఆవర్జాలో అకౌంటు వ్రాసేసావా?"

"వ్రాసేసానండి" వినయము, విధేయత పుట్టిపడేలా అన్నాడు

"ఆ ఆవర్జా యిలా అందుకో!" కళ్ళజోడు పైనుంచి చూస్తూ అన్నారు యజమాని

ఆవర్జా పుస్తకం పట్టుకొచ్చి ముందు పెట్టాడు కలాన్ని ఒక విదుపు విదిపి పుస్తకంలో వ్రాసుకోవటం ఆరంభించారు రామారావు అటు యిటు, ఒక్కోసారి ఆయన ముఖంకేసి చూస్తూ నిలబడ్డాడు సుబ్బరామయ్యగారు ఆవర్జా పుస్తకం మూసేసి పక్కనపెట్టి, ఓసారి మెడ వంకరగా అటు యిటు తిప్పి, మళ్ళీ యింకో పుస్తకంలో తల దూర్చారు

ఈయన జీతం సంగతి చెప్పడేమిటి? సంవత్సరం పైన అయింది జీతం పెంచి ఇంకా పట్టి యెనభై రూపాయలే! మార్కెట్లో ధరలు రెండురెట్లు పెరిగాయి కాని, జీతం ఒక్క రూపాయికూడ పెంచలేదు బి కాం పేసయి ఉద్యోగంకోసం తిరిగి తిరిగి ఏదీ గతిలేక 'టింబర్ డిపోలో' గుమాస్తా (కమ్ ప్యూనుగా) కుదిరాను ఇచ్చే నాలుగు డబ్బులైనా సరిగా యివ్వరు వెధవ వుద్యోగం!

సుబ్బరామయ్యగారు పుస్తకం మూసి పైకి లేచారు

"నా జీతం" నసిగాడు రామారావు

"పెంచాలా!"

'లేకపోతే గడ్డితిని బతకమంటారా?' అని మనసులో అనుకొని "అయ్య" అన్నాడు బుర్ర గోక్కుంటూ

"చూద్దాంలే ఆనక"

"చానాళ్ళనుంచీ చూద్దాంలే అంటూ మాటల్తోనే గడిపేస్తున్నారు"

"చాల ముఖ్యమైన పని ఒకటుండిపోయిందోయ్! ముందది చూడు డిసిటి ఒ ఆఫీసుకెళ్ళి ఆయన 'మామూలు' యిచ్చెయ్యాలి అర్జంటుగా"

"అలాగేనండి"

మూడు వందనోట్లు రామారావుకి అందించాడు

"త్వరగా వెళ్ళాలిసుమా!"

జీతం పెంచకపోయినా పని మాత్రం నిఖచ్చిగా చేయించుకుంటారు!

తలూపి సైకిలెక్కాడు

* * *

వాకిట్లో సైకిల్ స్టాండు వేసి ఇంట్లోకి నడిచాడు

"నాకు భోజనం వడ్డించు త్వరగా వెళ్ళాలి" శ్రీమతిని కేకేసాడు

పలకలేదు

గదిలోకి చూశాడు

శ్రీమతి మంచంమీద పడుకొనివుంది

మళ్ళీ కేకేసాడు

"భోజనమేగాని, నా బట్టలన్నీ చిరిగిపోయాయని చెప్తే నామాట మీరు పట్టించుకోలేదు" అని గొణుక్కొంటూ లేచి, వడ్డించింది

"నీ మాట నేను పట్టించుకున్నాను కాని, నామాట మా ఓనరే పట్టించుకోలేదు, జీతం పెంచమంటే!" విసుగ్గా అన్నాడు,

"సంసారంలో ఒకటుంటే ఒకటి లేదు మాయదారి బతుకులు మాయదారి వుద్యోగాలు!"

# సంపాదన

అంటూ తన బాధనంతా వెళ్లగక్కింది

రామారావు హడావిడిగా నాలుగు మెతుకులు మింగి సైకిలెక్కాడు.

ఆఫీసుముందు సైకిల్‌కి తాళమేసి డి సి టి ఒ రూం దగ్గిరికి వెళ్లాడు

కిటికీలోంచి తొంగిచూశాడు ఆఫీసరూ యింకా ఎవరో వున్నారు నోట్లు చేత్తో పట్టుకుని నిలబడ్డాడు ఇంతలో సుబ్బరామయ్యగారు వచ్చారు

ఏమిటీ, ఈయన వచ్చాడు ? నన్ను పంపిం తర్వాత యీయనకు పనేమిటి ? ఎందుకొచ్చాడు ?

"ఇచ్చేశావా ?" అన్నారు కంగారుగా

"ఇవ్వలేదు "

"అయితే యిలా ఇయ్యి నేనిస్తాను "

నోట్లు ఆయన చేతిలో పెట్టాడు

ఆయన లోపలికెళ్లి వెంటనే తిరిగొచ్చారు

"మేమంతా 'లయన్స్ క్లబ్'లో మెంబర్లవటం వలన ఆయన తీసుకోవటానికి మొహమాటపడ్తున్నాడు తీసుకోవటంలేదు మా ఓనరు పంపించారని చెప్పి ఎలాగో నువ్వే యిచ్చేసి వచ్చెయ్యి !"

రామారావు తలూపాడు

"మరి నా మామూలివ్వరండీ?" ఆడిటరు వచ్చాడు

"నీకూ యిప్పుడే కావాలా ?" అని, బయట హోటల్‌కు వెళ్లి వందనోటు మార్చి పట్టుకొచ్చారు పాతిక ఆడిటరు చేతిలో పెట్టి మిగిలిన రెండువందల డెబ్బైఅయిదు రూపాయలు రామారావు కిచ్చారు

"నేను కాఫీ తాగుతాను నువ్వు నెమ్మదిగా ప్రయత్నించు" అనేసి వెళ్లిపోయి హోటల్లో దూరారు

మీ ఆకలివంటి ఆకలికాదా నాది ? టీనీళ్లు కూడ పోయించరు వందల వందలు లంచాలు పోస్తారు కష్టపడి పనిచేసేవాళ్లకి జీతం పెంచమంటే పెంచరు మీ లాభాలు చూసుకుంటారు మాకుమాత్రం పొట్ట గడవద్దూ ! కసిగా చేతిలో వున్న నోట్లలోంచి 'పాతిక' తీసి జేబులో కుక్కాడు

ఆఫీసరు రూంలోకి వెళ్లాడు

రెండువందల యాభయిరూపాయలు డి సి టి ఒ చేతిలో పెట్టాడు

నోట్లు లెక్కపెట్టుకోకుండానే జేబులో పెట్టుకున్నాడు ఆఫీసరు

బైటకు వచ్చాడు రామారావు

ఓనరు దగ్గరకెళ్లి యిచ్చేశానని చెప్పాడు

"అయితే నువ్వు బాకీలకు వెళ్లిరా !" సుబ్బరామయ్యగారి మాటలతో హుషారుగా సైకిలెక్కాడు

బట్టలకొట్లో కెళ్లి చీర ఒకటి తీసుకున్నాడు

ఇంటికెళ్లాడు

"నీకో కానుక పట్టుకొచ్చాను" అన్నాడు చీరని చేత్తో ఆడిస్తూ

"ఏమిటి ?" అంటూ మంచంమీదనుంచి లేచి కూర్చుంది శ్రీమతి

"చూస్కో !"

"ఎక్కడిది ?" సంతోషపడిపోతూ చీర నందుకుంది

"సంపాయించాను " గర్వంగా అన్నాడు రామారావు

# కాలమిచ్చిన తీర్పు

(23వ పేజీ తరువాయి)

"విశ్వం ! ఇప్పటికీ మించిపోయిందిలేదు కొన్ని నెలలుగా నువ్వు మా ఇంట్లోనే ఉన్నావు — అయినా నా బిడ్డలతో సమం అనుకుంటాను నీకు పెట్టిన ఖర్చుల్ని గురించి కూడా నేను బాధపడను— ఇది నేను మనస్ఫూర్తిగా అంటున్న మాటలు అయితే నువ్వు హృదయపూర్వకంగా నీ నిర్ణయం ఏమిటో చెప్పెయ్యి వైవాహిక బంధం కావాలంటే ఏర్పడుతుంది కాని వద్దంటే పోదు అగ్నిసాక్షిగా ఏ స్త్రీనయితే అర్ధాంగిగా స్వీకరిస్తావో ఆదే వ్యక్తితో నువ్ జీవితమంతా గడపాలి సుజాత నువ్వు రోజూ చూస్తున్న మనిషే ఆమె అందచందాలు — లోపాలు కూడా తెలుసు నీకు దాన్ని చేసుకొంటే అది జీవితాంతం నిన్ను వదిలిపెట్టదు ఇక నీ సుఖ సంతోషాలన్నీ దాంతోనే అంతా అయిపోయాక మధ్యలో నీవు దాన్ని అవునన్నా కాదన్నా — అది సుజాతను వంచించినట్లు కాదు మాకు మనస్తాపం కలిగించినట్లే ఇన్ని ఆలోచించుకోవాలి విశ్వం, నువ్వు నాకు అల్లుడు కాబోయేముందు నిజమంటావా, కాదా ?" — వెనక ముందు చూసుకోకుండా మాట్లాడేస్తున్నాడు సుబ్బరామయ్య

"నిజమే సర్ అయితే నేను ఆలోచించుకోవలసిందేం లేదు ఇప్పుడు నన్ను మీరు ఏ విధంగాను శంకించవద్దు మీ మాటకు నేను ఎప్పుడూ కట్టుబడి ఉంటానండీ" — విశ్వం తన మనసులో మాటను చెప్పేశాడు

"సరే విశ్వం నువ్ సుజాతను చేసుకున్నాక మనసు ఒకచోట మనుగడ మరొకచోట కాకుండా మీరు సుఖంగా బ్రతకటమే నాకు కావలసింది ఇక నిన్ను ఒకటికి పదిసార్లు ఈ విషయం అడగను నీ మాటను నమ్మేశాను పోతే, నీ ఉద్యోగం — పెళ్లి అయ్యాక అయినా సరే, ఏదో ఏర్పాటు చేస్తాను దీన్నిగురించి నువ్వు దిగులుపడకు" అన్నాడు సుబ్బరామయ్య ఒక నిర్ణయానికి వచ్చి

రామనాథం తేలిగ్గా శ్వాస పీల్చాడు

ఆ మర్నాడే ముహూర్తం పెట్టుకున్నారు

సుబ్బరామయ్య అంతటితో ఒక ఒడ్డున పడ్డట్లు ఫీలయ్యాడు రామనాథం ఆ సాయంత్రమే వెళ్లిపోయాడు

అయితే ఈ సంగతి తెలిసి — నాకు తలనొప్పిగా ఉందంటూ ఆ రాత్రి భోజనమే మానేసింది సుమ

సుబ్బరామయ్య, సుందరి ఆమె మాట నిజమే అనుకున్నారు కానీ, సుజాత చెల్లెలి మాట నమ్మలేదు సుమ మనసు — ఆశ ఆమెకు తెలుసుమరి

విశ్వంతో తనకు పెళ్లి— ముహూర్తం నిర్ణయించుకున్నా, 'ఇది జరుగుతుందా ?' అనే విషయంలో సుజాతకు ఏమాత్రం నమ్మకంలేదు

తన వివాహమనేదే ఒక యజ్ఞం దాన్ని తన తండ్రి ప్రారంభించాడు మొండిగా నెరవేరుతుందన్న ఆశ ! — ఈ లోపల ఎన్ని విఘ్నాలో, ఎంతమంధి అడ్డువస్తారో ? ఆశించిన ఫలం దక్కుతుందో, దక్కదో — ఇది దైవనిర్ణయం మీద ఆధారపడి ఉంది అంతే

[ఇంకా ఉంది]

# సినిమా

( 28వ పేజీ తరువాయి)

### అక్కినేని వాణిశ్రీల ప్రణయం

"సూపర్ స్టార్" అక్కినేని దగ్గర 'అగ్రనటి' వాణిశ్రీ కార్యదర్శిగా చేరింది ఆమెపట్ల నాగేశ్వరరావుకు ప్రేమ మొలకెత్తింది వన్‌సైడ్ లవ్ కాదుగాబట్టి, వాణిశ్రీ తన బాస్‌కు మనసిచ్చింది

ప్రేమ ముదిరిన అక్కినేని వాణిశ్రీ, పాన్పుపై పవళించి ఒకర్నొకరు కన్నార్పకుండా చూడసాగారు ఇద్దరూ మౌనవ్రతాన్ని ఆచరించారు పరస్పరం "ప్రేమ"లోని మాధుర్యాన్ని గ్రోలారు

"ఏంటలా చూస్తున్నారు ఏదైనా
మాట్లాడండీ, అంది వాణిశ్రీ
నీ అందాన్ని జుర్రుకుంటున్నాను మాటలు
రావడం లేదే" అంటూ ఆమెను తన అధీనం చేసుకున్నాడు, అక్కినేని

ఈ మధుర క్షణాలపై ఆచార్య ఆత్రేయ రాసిన గీతాన్ని పాఠకులకు తెలుపుతాను

"పెదవి విప్పలేను, మనసు చెప్పలేను
పెదవికి వూహలు లేనేలేవు
మనసుకు మాటలు రావు " ఈ పాటకు మహదేవన్ సమకూర్చిన సంగీతం, రామకృష్ణ సుశీల పాడిన విధానం, అగ్రద్వయం అభినయించిన తీరు యువ హృదయాల్లో పన్నీటి జల్లు వర్షించడం తథ్యము

### సెక్రటరీ సూపర్ హిట్

"బంగారుమనిషి" రామానాయుడు రంగుల్లో నిర్మిస్తున్న "సెక్రటరీ" చిత్రం పట్ల ప్రేక్షకులు పెంచుకున్న ఆశలు, ఊహలు నూరుశాతం ఫలిస్తాయి అని రాయడానికి నేను సంశయించడం లేదు "సెక్రటరీ"చిత్రాన్ని నేను జెమినీ లాబ్‌లో చూశాను

నటీనటుల్లో అక్కినేని, వాణిశ్రీ అద్వితీయంగా వున్నారు తదితరులందరూ తక్కువ చెయ్యలేదు జయసుధ, కాంచన, శాంతకుమారి అన్నపూర్ణ, సత్యనారాయణ, గుమ్మడి, రాజబాబు, రమాప్రభ, అల్లురామలింగయ్య, గిరిజ చక్కగా చేశారు

"సెక్రటరీ" చిత్రాన్ని "ప్రేమనగర్"ను మించిన చిత్రంగా రూపొందించే బాధ్యతను కె ఎస్ ప్రకాశరావు, మహదేవన్, విన్సెంట్, జి వి సుబ్బారావు, మార్తాండ్ స్వీకరించారు నవయుగ విడుదల

— శ్రీనివాస్